క్లుప్తంగా

మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి



మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మి

కుల్కచర్ల: మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కోర్టు కేసులున్న వారు ఈ నెల 30న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న గొడవలకు కేసులు నమోదు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, న్యాయవాదులు బాలకృష్ణయ్య, నరేంద్ర యాదవ్, శివారెడ్డి, గౌస్ పాష, మోహన్, భీమయ్య, సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్



పైప్‌లైన్‌ను మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ అవ్వడంతో బుధవారం బాగు చేయించి పలు కాలనీల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిగిని జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దామన్నారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



శనైశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతలలో శంకర్ భారత్ మహరాజ్ 22వ ఆరాధనను బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి భజనలు చేస్తు జాగరణ నిర్వహించి ఉదయం మహరాజుకు పాదాభిషేకం చేశారు. అనంతరం గ్రామ పుర వీధుల్లో పల్లకీ సేవ చేశారు. ఈ భక్తుల భజనలు, కోలాటంతో చేపట్టిన ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. అనంతరం శనైశ్చరాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, బక్కారెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులతో శారదావెంకటేశ్, రమాదేవి

మొయినాబాద్‌రూరల్: ఇగ్నైట్ ఫెస్ట్ క్రీడా పోటీల్లో చేవెళ్ల విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. బుధవారం టోల్‌కట్ట సమీపంలోని శివారెడ్డిపేట్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఇగ్నైట్ ఫెస్ట్–2023 హెచ్ఆర్ హార్వెస్ట్ రీజియన్ అల్గారిథమ్ పేరుతో నిర్వహించిన క్రీడల్లో చేవెళ్ల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ శివారెడ్డిపేట్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రణిత ద్వితీయ బహుమతి, నందిని తెలుగులో ద్వితీయ స్థానం, పుస్తక సమీక్షలో ఇంగ్లీష్‌లో ప్రథమ స్థానం, స్కిట్ అండ్ డ్రామా నిహారిక, స్పందన, అమూల్య, కావేరి, అర్చన, నందిని, రుచితో ఆసిని, ఇందిరాప్రియదర్శిని గ్రూప్ ప్రథమ స్థానం, టిమాటిక్ డ్రాయింగ్‌లో రాజేశ్వరి మూడోస్థానం, పెయింటింగ్‌లో శృతి మూడోస్థానం, బెస్ట్ అవుట్ ఆఫ్ వెస్ట్‌లో మైత్రి ద్వితీయ స్థానం బహుమతులు గెల్చుకున్నారని చెప్పారు. గురుకులాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి శారదావెంకటేశ్, ప్రిన్సిపాల్ రమాదేవి విద్యార్థులను అభినందించారు.

కారు నడిపేది ఎవరో..?

- ఎన్నికల ముందే హస్తం గూటికి చేరిన మండలాధ్యక్షుడు
- ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- అధ్యక్ష పదవి చేపట్టేందుకు నాయకుల అనాసక్తి
- నిస్తేజంలో గులాబీ కేడర్



తాండూరు రూరల్: శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఇచ్చిన మండలానికి అధ్యక్షుడు కరువయ్యాడు. గతంలో పనిచేసిన కోటబాసుపల్లి గ్రామానికి చెందిన గుర్రపల్లి రాందాస్ ఎన్నికల ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. దీంతో అప్పటి నుంచి ఆ పదవి ఖాళీగానే ఉంది. ఎన్నికల సమయంలో అధ్యక్షుడిని నియమిస్తే నాయకుల మధ్య విబేధాలు వస్తాయని అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నియామకానికి ఆసక్తి చూపలేదు. ఎమ్మెల్యేగా ఓడినా.. ఆయనకు ఆధిక్యం తెచ్చింది మాత్రం తాండూరు మండలంలోనే. కాగా పైలట్ ఓటమి తర్వాత మండలాధ్యక్ష బాధ్యతలు తీసుకునేందుకు నాయకులు ఆసక్తి చూపడం లేదు.

పైలట్ నిర్ణయం కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. జనవరి నెలాఖరుకు పంచాయతీల సర్పంచ్ పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ఓ నాయకుడు కావాలి. ఆయనతోనే గ్రామాల్లో పార్టీ పటిష్టత సాధ్యమవుతుంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఇప్పటి వరకు గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించిన దాఖలాలే లేవు. కేడర్‌లో ఉత్తేజం తీసుకువచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నిర్ణయం కోసం గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీరాంరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన శ్రీరాంరెడ్డి పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేశారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీరాంరెడ్డి

విద్యా వలంటీర్‌కు వేతనం అందజేత

కొందుర్గు: విద్యా వలంటీర్‌కు జూన్ నుంచి నవంబర్ వేతనాన్ని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అందజేశారు. మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని పాఠశాల హెచ్ఎం ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన అతను విద్యా వలంటీర్‌ను నియమించుకోవాలని హెచ్ఎం ప్రేమ్‌సాగర్‌కు సూచించారు. విద్యావలంటీర్‌కు ప్రతినెల వేతనాన్ని తను చెల్లిస్తానని హెచ్ఎంకు హామీ ఇవ్వడంతో విద్యావలంటీర్‌ను నియమించుకున్నారు.

రేవంతన్న పాలనతో రాష్ట్రాభివృద్ధి



శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

కొడంగల్ రూరల్: రేవంతన్న పాలనతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయినందుకుగాను బుధవారం పార్టీ నాయకులు పాదయాత్రగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. ఈ యాత్రను పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ముస్తాక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి పదవి చేపడితే శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వస్తామని హస్నాబాద్ పార్టీ శ్రేణులు మొక్కుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భీములు, సంజీవ్, కృష్ణ, నర్సింలు, జావిద్, శ్రీశైలం, సురేశ్, ఆనంద్, గోపి, అనిల్, మహిపాల్‌రెడ్డి, రాజు, శ్రీను, యూనస్, రవి, మదన్ తదితరులు పాదయాత్రగా తరలివెళ్లారు.

ఫారం–6తో ఓటు హక్కు నమోదు

తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన వారంతా ఫారం–6 ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గతంలో ఓటు హక్కు పొందిన వారు తప్పొప్పులు సరిచూసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు లిస్ట్ నుంచి తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, ఆర్ఐ రాజిరెడ్డి, ఆర్ఐ రాజిరెడ్డి, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిలకు సిద్ధమవ్వండి: కొడంగల్ తహసీల్దార్

కొడంగల్ రూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారులు అందుకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్ఓలకు పలు సూచనలు ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిబ్బంది పనితీరును అభినందించారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటరు జాబితాను పరిశీలిస్తూ క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ శ్రుతి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: సమావేశంలో పాల్గొన్న బీఎల్ఓలు



కొడంగల్ రూరల్: బీఎల్ఓలతో సమావేశమైన తహసీల్దార్ విజయ్‌కుమార్

కాంగ్రెస్ గూటికి 'కారు' కౌన్సిలర్

అదే బాటలో మరో ముగ్గురు



కౌన్సిలర్ గాయత్రిలక్ష్మణ్ దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వలసలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు శివరాంనగర్ కాలనీ కౌన్సిలర్ మాలె గాయత్రి లక్ష్మణ్ దంపతులు బుధవారం కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ప్రోత్సాహం మేరకు కౌన్సిలర్ దంపతులు ఎమ్మెల్యేలు ప్రసాద్‌కుమార్, రాంమ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరున్న లక్ష్మణ్ పార్టీ మార్పు గులాబీ కేడర్‌కు కొంత నష్టమేనని చర్చించుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో కాంగ్రెస్‌కు లీడ్ ఇచ్చినా.. శివరాంనగర్‌లో మాత్రం కారుకు 150పై చిలుకు ఓట్లు మెజార్టీ వచ్చింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, పార్టీ నాయకులు దీపక్ తదితరులున్నారు.

'గులాబీ' జెండాను వీడనున్న మరో ముగ్గురు..?

బీఆర్ఎస్‌కు చెందిన మరో ముగ్గురు కౌన్సిలర్లు పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ నాయకుడి కుటుంబీకులకు కౌన్సిలర్ టికెట్ ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఇబ్బందులకు గురిచేశాడని.. అయినప్పటికీ టికెట్ తెచ్చుకుని విజయం సాధించిన ఆయన ఇన్నాళ్లు ఆనంద్‌తో దూరంగా ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ సీనియర్ కౌన్సిలర్ పార్టీలో, కౌన్సిల్‌లో ప్రాధన్యత ఇవ్వలేదని గుర్రుగా ఉన్నాడు. ఆయన కూడా కారు దిగేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. శివారు వార్డుల్లోని ఓ కౌన్సిలర్ కాంగ్రెస్‌తో చేయి కలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ముందుగా పార్టీ మారేందుకు ఆసక్తి చూపిన ముగ్గురు కౌన్సిలర్లను మాత్రమే హస్తం గూటికి చేర్చుకోవాలని ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్, సీనియర్ నాయకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. వలసలను ప్రోత్సహిస్తే ఇన్ని రోజులుగా పార్టీని నమ్ముకుని పనిచేసిన వారికి నష్టం జరుగుతుందనే అభిప్రాయంతో ఎమ్మెల్యే ఉన్నారంటూ చర్చలు వినిపిస్తున్నాయి. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నమ్ముకుని ఇన్నాళ్లు కష్ట పడ్డ వారికే ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది.

సమయానుకూలంగా బస్సులు నడపండి

డీఎంకు విన్నవించిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సు సర్వీసులను సమయానుకూలంగా బస్సులు నడపాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంకిత్ అనురాగ్ తాండూరు డిపో మేనేజర్ సమతను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం డీఎంకు వినతిపత్రం అందజేశారు. పట్టణానికి నిత్యం వేలాది మంది విద్యార్థులు వస్తుంటారని సమయానికి బస్సులు సర్వీసులు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పలు గ్రామాలకు సర్వీసులు లేక విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దేముల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు ప్రశాంత్‌కుమార్ తదితరులున్నారు.



డీఎం సమతకు సమస్యను వివరిస్తున్న అంకిత్ అనురాగ్

అంబేడ్కర్ ఆశయ సాధనకు సంఘటితమవ్వాలి



భూమిపూజలో మల్కాపూర్ గ్రామస్తులు

జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్‌నాయక్

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ ఆశయసాధనకు సంఘటితమవ్వాలని కుల్కచర్ల జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మల్కాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగుల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. యువత ఆయన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, నాయకులు గురుదేవరెడ్డి, అశోక్, తిరుపతయ్య, లక్ష్మణ్, గోవర్ధన్, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవలు కరువు!



షాబాద్‌లోని ఎరువుల దుకాణం

- పనిచేయని పీఎం కిసాన్ కేంద్రాలు
- చేతులెత్తేసిన ఎరువుల కంపెనీలు
- పట్టించుకోని అధికారులు

షాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ కేంద్రాల్లో రైతులకు తగిన సేవలు అందడం లేదు. రైతులకు అన్నిరకాల సేవలు ఒకేచోట అందించేలా ఎరువుల దుకాణాలన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు, సాగులోని మెళకువలు, ఇతర సేవలను రైతులకు అందించాలి. జులై 27న రాజస్థాన్‌లో ఈ కేంద్రాన్ని ప్రధాన మోదీ లాంఛనంగా ప్రారంభించారు. దీంతో జిల్లాలోని 400పైచిలుకు వివిధ ఎరువుల కంపెనీలు, ఎరువుల దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి కేంద్రాలను ప్రారంభించారు. ఇంటర్‌నెట్ సదుపాయం, ఎల్ఈడీ టీవీలు, రైతులు కూర్చునేందుకు కుర్చీలు సమకూర్చారు.

ఇదీ పరిస్థితి...

కేంద్రం అందించే డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను రాయితీతో విక్రయిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలతో నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా పంటల సాగులో రైతులకు ఎదురయ్యే సందేహాలు నివృత్తి చేస్తూ సూచనలు అందించాలి. భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలు తెలియజేయాలి. ఏ ఎరువు ఎంత మోతాదులో వాడాలో చెప్పాలి. కానీ ఇవేవీ అమలు కావడం లేదు. కొన్నిచోట్ల బోర్డులు పెట్టి ఫొటోలు తీసుకుపోయారే తప్పా సౌకర్యాలు కరవు అయ్యాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు చోట్ల ఎరువులు విక్రయించడం నిలిపివేసిన దుకాణాల వద్ద కూడా బోర్డు పెట్టారంటే చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 400లకు పైగా ఎరువుల దుకాణాలు ఉండగా విడతల వారీగా అన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మారుస్తామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎరువుల కంపెనీల అధికారులు తెలిపారు. కానీ ఇప్పటికీ ఎక్కడా కూడా కేంద్రాల ఏర్పాటునకు చర్యలు చేపట్టలేదు.

పర్యవేక్షణ కరువు..

కేంద్రం తలపెట్టిన బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా, మండల వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలి. కానీ వారు అలా చేయకుండా దూరంగా ఉన్నారు. కొన్ని కంపెనీల ప్రతినిధులను వివరణ కోరగా, అన్ని ఎరువుల దుకాణాల్లో రైతుల అవసరాలు తీర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. జిల్లాలోని ప్రతి ఎరువుల కేంద్రంలో నిర్దేశించిన నిబంధనలను పాటిస్తామని వారు పేర్కొన్నారు. వాటిని సరిదిద్దేందుకు ఇంకా కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డిలతో కలిసి గ్రామంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 211 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 61 మందిని ఆపరేషన్ కోసం గురువారం ప్రత్యేక బస్సులో తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందన్నారు. ఇలాంటి శిబిరాలను పేదలు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎంపీటీసీ సభ్యుడు చెన్నయ్య

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ముద్దెంగూడ ఎంపీటీసీ చెన్నయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ మల్లన్న గుట్టపై అన్నదాన సత్రం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తి అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

మంత్రి సీతక్కకి సర్పంచ్‌ల సంఘం వినతి

కొత్తూరు: రాష్ట్రంలో ఇప్పటి వరకు పంచాయతీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూమన్నయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అంబటి ప్రభాకర్‌ముదిరాజ్‌లు కోరారు. బుధవారం వారు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేయాలని వారు ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 32శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసిన్నట్లు వారు పేర్కొన్నారు.



మంత్రి సీతక్కతో సర్పంచ్‌ల సంఘం సభ్యులు

వంద రోజుల్లో హామీల అమలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వలో బుధవారం యాచవరం శ్రీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం మోహన్‌రెడ్డి నిర్మించిన బస్‌స్టాండ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం మాదిరిగా కార్యకర్తలకే అందించలేమని, అర్హులైన ప్రతీ ఒక్కరిని గ్రామసభల ద్వారా గుర్తించి అందిస్తామన్నారు. ప్రజల దీవేనలతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే రెండు హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల తదితరులు పాల్గొన్నారు.